# కొత్త దీపం

"తాతా... నేనొస్తున్నా... ఎల్లుండి పొద్దున్నకల్లా ఫ్లైట్ దిగి... మన యింటి ముందు వాలతా"'

"ఏవిటో.. ఒక్క మాట కూడా వినపడట్లేదు.. వెధవ ఫోన్లూ... వెధవ మాలోకం... అప్పుల వాళ్లో తెలియదు. మనవాడో తెలీదు" విసుక్కున్నాడు సూర్యారావ్.

"మీకు వినిపించదు.. ఫోను మూయకుండా సణగకూడదని లక్షసార్లు చెప్పాను" అంటూ కిచెన్‌లోంచి బయటకొచ్చి.. భర్త చేతిలోంచి ఫోన్

లాక్కుంది భాగ్యం.

"ఎవరండీ.. హలో చెప్పండీ" అంది.

"నేను బామ్మా... చిట్టిగాడ్ని"

"చెప్పరా నాన్నా.. నువ్వా... మీ తాతకి ఫోన్ బెల్ తప్ప బొత్తిగా వినిపించటం మానేసిందిరా... చెప్పునాన్నా.. ఎలా వున్నావ్... ఎప్పుడొస్తున్నావ్?"

"ఏవండీ.. ఎల్లుండి వస్తున్నాట్ట. మన చిట్టిగాడు మీకోసం చెవిటి మిషన్ కూడా తెస్తున్నాడండీ. బొంబాయిలో చౌకట" ఉత్సాహంగా చెప్తున్న భాగ్యం కళ్ళల్లో కాంతి పెద్దాయనకు కథ చెప్పేసింది.

"నాకు వినిపించిందే తింగరబుచ్చీ.. మనవాడు వస్తున్నాడు... అంతే కదా" అన్నాడు సూర్యారావ్.

భాగ్యం కళ్ళల్లో చివ్వున నీళ్లు చిమ్మాయి. 'మనవాడు కాదు... మ..న..వ..డు!' అనుకుంటూ మొహం చాటేసి లోపలికి వెళ్ళిపోయింది.

✦ ✦ ✦

కొడుకు అస్తికలు కలిపి... కృష్ణానది నుంచి వస్తుంటే.. ఓ పసిగుడ్డు వడ్డు మీద దొరికాడు.. అది పాత కథ.

చిట్టిగాడ్ని... ఎలా చేరదీశారో వాడు ఎలా వాళ్లకి దొరికాడో..

ఈ పాతికేళ్ళల్లో.. భాగ్యం, సూర్యారావ్‌లు మర్చిపోయారు-

చీకట్లో దీపంలా, శూన్యంలో సంగీతంలా... వాడు కన్పించాడు. వాడే లోకం అయ్యాడు. వాడే శోకాన్ని తుడిచేసిన దేవుడయ్యాడు.

ఒక్కగానొక్క బిడ్డపోయి కొండంత దుఃఖంలో మృత్యువు కోసం అలమటిస్తున్న సమయంలో అమృత భాండంలా దొరికాడు.

"దివికేగిన బిడ్డే... దిగొచ్చి... ఒళ్లో చేరాడని.. వీడికోసం బతకొచ్చనీ.. కాదు.. బతికి తీరాలనీ... బాధ్యత పెంచుకున్నాం" అని ఆ దంపతులిద్దరూ కళ్ళు తుడుచుకున్నారు.

చుట్టాలూ... స్నేహితులూ... కొత్తగా తగిలిన ఈ బంధానికి చాటుగుండా నవ్వుకున్నారు. ఎదురుగుండా అడిగేశారు... కానీ.. నలభయ్యో పడిలో పడిన భాగ్యానికీ, భర్తకీ అదో కొత్త జంఝాటమే... అయితే అదే కన్నీటి సముద్రాన్ని కడతేర్చే నావ అనిపించింది. ఒక్క పాతికేళ్ళు వాడ్ని పెంచి పెద్ద చేస్తే... తలకొరివి పెడతాడన్న ఆశ కలిగింది. కానీ నిజమే కావచ్చు 'జడ భరతుడి' కమిట్‌మెంట్లా.. ఈ వయసులో నీకీ బంధాలు ఎందుకయ్యా... అని అందరూ అన్నారు.

అలా అన్నప్పుడు ఆ భార్యాభర్తలిద్దరూ... కొంతసేపు సందిగ్ధంలో పడ్డ మాట నిజం!

అయినా వాడు బోర్లాపడితే బొబ్బట్లొండి నలుగురికీ పంచారు.

అడుగులేస్తే.. అరిసెలొండి వీధంతకీ పండగజేసారు.

వాడు.. అత్త.. తాత అంటూ రెండక్షరాలు పదాలు నేర్చుకుంటోంటే... తాత–బామ్మ– నేర్పించి వాళ్లిద్దరూ ఆ వరసకి ఫిక్సయిపోయారు.

దేవుడు చాలా విశాల హృదయంతో ఆలోచించి ఓ వయసొచ్చాక సృష్టి చేసే శక్తిని ఆపేస్తాడు.

ఇప్పుడు.. ఓపికపోతూన్న వయస్సులో వీణ్ని పెంచే కొత్త ఓపికిచ్చిందీవాడే!

'దేవుడా... ఇప్పుడైనా.. మా కోరిక తీరుస్తావు కదా... మా చిట్టిగాడు పెరిగి పెద్దాడై మమ్మల్ని కడతేర్చేలా చేస్తావు కదా!'

ఇదే ప్రార్థన ఆ దంపతులిద్దరిదీ!

చదవులు పూర్తయ్యాయి.

చిట్టిగాడికి ఉద్యోగం వచ్చే వయసొచ్చింది.

ఈ 'ఆదిదంపతుల' ఆనందానికి హద్దుల్లేవు-

"వాడికో పిల్లని చూసి పెళ్లి చేయాలండీ" అంది ఒకరోజున భాగ్యం-

"వాడికి పెళ్ళేంటే వెఱ్ఱిదానా వాడే పిల్లాడు" అన్నాడు సూర్యారావు.

"అహ్హా... వాణ్ని భుజమ్మీద ఎక్కించుకుని ఉప్పుబస్తా ఆడిస్తారా? మోకాళ్ల మీద పడుకోబెట్టుకుని తైతక్కలాడిస్తారా? మీ భుజమెక్కి వాడు కూచుంటే నేను గోరు ముద్దలు తినిపించగలనా... ఏవండీ.. నాకు డెబ్భై ఏళ్ళు.. వాడి తాతకి డెబ్భై దాటాయండీ.. వాడు పెద్దాడయ్యాడండీ" అంది భాగ్యం వెటకారంగా.

"నేను వాడికి తాతను కాదే.. నాన్నని... ఆ... అంతే" అన్నాడు సూర్యారావ్ షడెన్‌గా-

భాగ్యం షాక్ అయింది.

"ఇదేం కొత్త వరసండీ.. మీకు మతిగాని పోయిందా"

"అవును భాగ్యం.. పాతికేళ్ళ క్రితం వాడు దొరికినప్పుడు కొడుకు అని పెంచుకోడానికి... అనిపించుకోడానికి సిగ్గుపడే వయస్సు- వాడికి తాతా, బామ్మా అని నేర్పించా, అలా పిలిపించుకున్నాం... యిప్పుడు వాడికి కొత్త మాటలు నేర్పిస్తాను... కొరివి పెట్టేవాడు కొడుకే! వాడికి ఆ సంగతి చెబుతా... నాన్నా... అనిపించుకుంటాను..."

భాగ్యం కళ్ళల్లో నీళ్ళు ఆగలేదు.